క్లుప్తంగా

బీజేపీ రజక సెల్ జిల్లా కన్వీనర్‌గా బాలకిషన్


బాలకిషన్

భువనగిరి రూరల్: బీజేపీ ఓబీసీ మోర్చా రజక సెల్ జిల్లా కన్వీనర్‌గా మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన కొత్తపల్లి బాలకిషన్‌ను నియమిస్తూ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు దుర్గాపతి లక్ష్మీనారాయణ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాలకిషన్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, నాయకులు పోతంశెట్టి రవీందర్, గూడూరు నారాయణరెడ్డి, బూర నర్సయ్య గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

సైదాపురంలో ఉచిత వైద్యశిబిరం


వృద్ధులను పరీక్షిస్తున్న వైద్యురాలు

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని సైదాపురం గ్రామంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, జిల్లా శాఖ సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. మొత్తం 86 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ లక్ష్మీనరసింహారెడ్డి మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ సైదాపురం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్డి బాలాజీ, డివిజన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, హమీద్,చారి, రామ్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పరిశ్రమపై చర్యలు తీసుకోవాలి

చౌటుప్పల్: కాలుష్యాన్ని వెదజల్లుతున్న కొయ్యలగూడెం గ్రామంలోని ఎస్‌వీల్యాబ్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంఆర్‌పీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి బోయ లింగస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ శ్రీనివాసకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పర్యావరణ అనుమతులు లేకుండానే పరిశ్రమ నడిపిస్తున్నారన్నారు. ఈనెల 21న కంపెనీలో రియాక్టర్ పేలడంతో ఓ వ్యక్తి చనిపోయాడని, మరో ఇద్దరికి గాయాలయ్యాయని గుర్తు చేశారు. తక్షణమే విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

హనుమాన్ జయంతి పోస్టర్ ఆవిష్కరణ

చౌటుప్పల్: పట్టణ కేంద్రంలోని శ్రీపాటిమీది ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం హనుమాన్ జయంతి వేడుకల పోస్టర్లను మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, దేవాలయ కమిటీ అధ్యక్షుడు సందగళ్ల నాగరాజుగౌడ్, ప్రధాన కార్యదర్శి ఊడుగు రమేష్, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.


కేజీబీవీలో ప్రవేశానికి ఆహ్వానం

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని కేజీబీవీలో ప్రవేశానికి ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ప్రత్యేక అధికారి ఎం.పద్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో 40, ఏడో తరగతిలో 3 సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించవచ్చని కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

గుండాల: గుండాల మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎ.దేవిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అధికారులంతా తమ శాఖలకు సంబంధించిన నివేదికలతో సకాలంలో హాజరు కావాలని కోరారు.

బ్యాంకు సేవలపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ నాగమణి

బొమ్మలరామారం: గ్రామీణ ప్రాంత మహిళలంతా బ్యాంకు సేవలపై తప్పనిసరిగా అవగాహన ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి అన్నారు. మండలంలోని తూంకుంట, రామలింగంపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం మహిళలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. పీఎం బీమా, సుకన్య సమృద్ధి పథకాలు, సైబర్‌నేరాలు నియంత్రణపై అవగాహన కల్పించారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సంస్థ సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ విశ్వనాథ్, భాను, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నిధులున్నా.. మరమ్మతులు సున్నా!


వెల్లంకి-సుంకెనపల్లి గ్రామాల మధ్య దెబ్బతిన్న బీటీ రోడ్డు


సుంకెనపల్లి సమీపంలో ఆనవాళ్లు కోల్పోయిన బీటీ రోడ్డు

- అధ్వానంగా వెల్లంకి-సుంకెనపల్లి రోడ్డు
- మరమ్మతులకు రూ.1.46కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- పలుసార్లు టెండర్లు పిలిచినా ముందుకురాని కాంట్రాక్టర్లు

రామన్నపేట: రామన్నపేట మండలంలోని వెల్లంకి-సుంకెనపల్లి, వెల్లంకి-గొల్నేపల్లి గ్రామాల మధ్య గల బీటీ రోడ్డు దెబ్బతిని అధ్వానంగా మారింది. రోడ్డు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా నేటికీ ఎలాంటి మరమ్మతులు చేయకపోవడంతో ఆనవాళ్లు కోల్పోయి కంకర రోడ్డును తలపిస్తోంది. కంకర తేలి, గుంతలమయమైన రోడ్డు మీద ప్రయాణించడానికి జనం నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ రోడ్డు మరమ్మతులకు మోక్షమెప్పుడు కలుగుతుందోనని జనం అంటున్నారు.

ఇరవై ఏళ్ల క్రితం నిర్మాణం

చిట్యాల మండలం గుండ్రాంపల్లి నుంచి వలిగొండ మండలం గొల్నేపల్లి(నాగారం క్రాస్‌రోడ్డు) వరకు సుంకెనపల్లి, వెల్లంకి, సుద్దబావిగూడెం, గొల్నేపల్లి గ్రామాల మీదుగా 2003లో ప్రధానమంత్రి గ్రామీణ సడక్‌యోజన పథకంలో బీటీరోడ్డును నిర్మించారు. ఈ మార్గంలో కొంతకాలం ఆర్టీసీ బస్సును కూడా నడిపారు. రోడ్డు నిర్మాణం జరిగి దాదాపు ఇరవై ఏళ్లు దాటింది. అప్పటినుంచి ఎలాంటి మరమ్మతులు జరుగలేదు. వెల్లంకి-సుంకెనపల్లి గ్రామాల మధ్య రోడ్డు బాగా దెబ్బతిన్నది. బీటీలేచిపోయి కంకర తేలింది. అడుగడుగున గుంతలు ఏర్పడ్డాయి.

నిధులు మంజూరైనా..

వెల్లంకి-గుండ్రాంపల్లి గ్రామాల మధ్య రోడ్డు పూర్తిస్థాయి మరమ్మతులకు 2022-23 బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.1.46కోట్ల నిధులు మంజూరు చేసింది. చిట్యాల మండల పరిధిలోని రోడ్డు మరమ్మతులకు రూ.56లక్షలు, రామన్నపేట మండల పరిధిలో రూ.90లక్షలు కేటాయించారు. మరమ్మతులకు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు పలుమార్లు టెండర్లు పిలిచింది. క్షేత్రస్థాయిలో అవసరమైన మరమ్మతులకు, మంజూరైన నిధులు సరిపడవని తెలిసి టెండర్లు వేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.

ప్రయాణికులకు తప్పని తిప్పలు

వెల్లంకి, సిరిపురం, గొల్నేపల్లి, సర్నేనిగూడెం గ్రామాలకు చెందిన వందలాది మంది యువకులు జాతీయ రహదారి వెంట గల పరిశ్రమల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. వారు ప్రతిరోజూ ఈ రోడ్డుగుండానే రాకపోకలు సాగిస్తుంటారు. ప్రత్యామ్నాయ మార్గం కూడా లేదు. గుంతలమయమై, కంకరతేలిన రోడ్డుగుండా ప్రయాణించడానికి వాహనదారులు చాలా తిప్పలు పడుతున్నారు. వాహనాలు దెబ్బతింటున్నాయని, ప్రమాదాలు జరుగుతున్నాయని యువకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డు మరమ్మతులు వెంటనే చేపట్టాలని కోరుతున్నారు.

చాలా ఇబ్బంది పడుతున్నాం



నేను ఒక ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నారు. షిఫ్టుల వారీగా డ్యూటీ ఉంటుంది. వెల్లంకి-సుంకెనపల్లి మధ్య రోడ్డు అధ్వానంగా మారింది. కంకర రాళ్లు తగిలి బైక్‌ల టైర్లు దెబ్బతింటున్నాయి. నైట్‌షిఫ్ట్ ఉన్నప్పుడు వచ్చి పోవడానికి నరకం అనుభవిస్తున్నాం. చాలా ఇబ్బంది పడుతున్నాం. అధికారులు, పాలకులు స్పందించి త్వరగా రోడ్డు మరమ్మతులు చేయించాలి.

– నకిరేకంటి రాంబాబు, ప్రైవేట్ ఉద్యోగి,వెల్లంకి

అంజయ్య మృతి సీపీఐకి తీరనిలోటు


సంతాప సభలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

మోటకొండూర్: మండలంలో ఇక్కుర్తి గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు అయిలి అంజయ్య మృతి పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. బుధవారం గ్రామంలో ఏర్పాటు చేసిన అంజయ్య సంతాప సభలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, మండల పార్టీ కార్యదర్శి గాదెగాని మాణిక్యం, చెక్క వెంకటేష్, ఐలి సత్తయ్య, ఉప్పల శాంతి కుమార్, బొలగాని అశోక్, బీరకాయల మధు, జివిలికపల్లి పాండు, శ్రీను తదితరులు ఉన్నారు.

చుక్క ముత్తయ్య మృతికి సంతాపం

అడ్డగూడూరు: అడ్డగూడూరుకు చెందిన సీపీఐ టౌన్ కార్యదర్శి చుక్క ముత్తయ్య బుధవారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములుతో పాటు వివిధ పార్టీల నాయకులు ముత్తయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి సంతాపం తెలిపారు. అనంతరం కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా గోద శ్రీరాములు మాట్లాడుతూ ముత్తయ్య సీపీఐ ప్రజానాట్య మండలికి చేసిన సేవలు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీ నాయకులు చేడె చంద్రయ్య, ఉప్పుల ముత్యాలు, అన్నెపు వెంకట్, నాగిరెడ్డి, బుర్ర అనిల్ కుమార్, తుమ్మల వెంకట్‌రెడ్డి, యుంగేధర్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయ ధ్వజ స్తంభానికి ఇత్తడి తొడుగు బహూకరణ


పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కవితాలక్ష్మీనర్సింహారెడ్డి, దాతలు

మోత్కూరు: మోత్కూరులోని అంగడిబజార్‌లో గల శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ ధ్వజ స్తంభానికి మోత్కూరు పట్టణానికి చెందిన దాతలు పల్లెర్ల వెంకన్న-కళ్యాణి, దామర సోమేశ్వర్-స్వాతి గుప్తాలు ఇచ్చిన రూ.1.50 లక్షల విలువైన ఇత్తడి తొడుగును బుధవారం బహూకరించారు. ఈ ఇత్తడి తొడుగును మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితాలక్ష్మీనర్సింహారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు పారునంది సూరిబాబు శర్మ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాతలు, భక్తులు పాల్గొన్నారు.

‘అమ్మ ఆదర్శ’ పనులు వేగంగా పూర్తిచేయాలి


పెద్దపడిశాలలో పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ దేవిక

గుండాల: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన మౌలిక వసతుల కల్పన పనులు వేగంగా పూర్తిచేయాలని గుండాల ఎంపీడీఓ ఎ.దేవిక ఆదేశించారు. బుధవారం మండలంలోని పాచిల్ల, వంగాల, తుర్కలశాపురం, పెద్దపడిశాల, వస్తాకొండూర్, బండకొత్తపల్లి గ్రామాల్లోని పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను పరిశీలించి మాట్లాడారు. పాఠశాలల పునఃప్రారంభం లోపే పనులు పూర్తి చేయాలని కోరారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శులు రమేష్, మౌనిక, సీఆర్‌పీ లింగయ్య, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, చైర్మన్‌లు తదితరులు ఉన్నారు.

నాగేందర్‌రావుకు ఘన నివాళి

వలిగొండ: మండలంలోని టేకులసోమారం గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దివంగత కసుబ నాగేందర్‌రావు 15వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆ గ్రామంలో ఆ పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామంలో పేదలకు, పాఠశాలకు భూదానం చేసిన ఉదారవాది నాగేందర్‌రావు అని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రేఖల ప్రభాకర్‌గౌడ్, చేగూరి భిక్షపతి, జిల్లాల మల్లారెడ్డి, నారగోని పాండు, గోవర్ధన్, లక్ష్మయ్య, పాక వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.


నాగేందర్‌రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నకిలీ విత్తనాలపై అవగాహన

నార్కట్‌పల్లి: విత్తనాలు ఎరువులు, పురుగు మందుల అమ్మకంలో డీలర్లు నిబంధనలు పాటించాలని నకిరేకల్ వ్యవసాయ సహాయ సంచాలకులు రామారావునాయక్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో నకిలీ విత్తనాల నిర్మూలనపై అధీకృత డీలర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్‌ఐ అంతిరెడ్డి మాట్లాడుతూ ఎవరైనా రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎడవల్లి గిరిప్రసాద్, ఏఈఓ లియాఖత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

తొందరపడి విత్తనాలు వేయొద్దు

మునుగోడు: వానాకాలం పంటలు సాగుచేసే రైతులు చాలీచాలని వర్షాలు కురవగానే తొందరపడి విత్తనాలు వేయొద్దని, కనీసం 65 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైన తరువాతే విత్తనాలు నాటుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. బుధవారం మండలంలోని సింగారం, చల్మెడ గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఒకే రకం పత్తి విత్తనాలపై మక్కువ పెంచుకుని ఆ విత్తనాలే కావాలనే ఆలోచన మానుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఏఈఓలు నర్సింహ, వహీద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

31న డీటీఎఫ్ జిల్లా విద్యా సదస్సు


నకిరేకల్ : ప్రచార కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీటీఎఫ్ జిల్లా ప్రతినిధులు

నకిరేకల్: ఈ నెల 31 నల్లగొండలోని ఎస్‌బీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగే డీటీఎఫ్ జిల్లా విద్యా సదస్సును జయప్రదం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.వెంకటేషం కోరారు. సదస్సుకు సంబంధించిన ప్రచార కరపత్రాలను నకిరేకల్‌లో బుధవారం ఆయన విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు నర్సింహాచారి, పోతుల గోపాల్, భూపాల్, కడియం మహేశ్వర్, జి.అంజయ్య, కే.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పూర్తి

గుండాల: మండలంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయని పీఏసీఎస్ చైర్మన్ లింగాల భిక్షం తెలిపారు. బుధవారం ఆయన గుండాలలో విలేకరులతో మాట్లాడుతూ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తొమ్మిది సెంటర్లలో 739 మంది రైతుల నుంచి 48,123 క్వింటాళ్ల 60 కిలోల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి 70శాతం వరకు రైతులకు డబ్బులు వారి బ్యాంకు అకౌంట్లలో జమ అయినట్లు చెప్పారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు కావాల్సిన జీలుగ విత్తనాలను త్వరలోనే తెప్పిస్తామని పేర్కొన్నారు.

నాణ్యమైన పత్తి విత్తనాలను కొనుగోలు చేయాలి

ఆత్మకూరు(ఎం): రైతులు నాణ్యమైన పత్తి విత్తనాలను మాత్రమే లైసెన్స్ డీలర్ల వద్ద కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.సుజాత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనాల కొనుగోలులో పత్తి విత్తనాల ప్యాకెట్‌పై తయారీ, గడువు తేదీని పరిశీలించాలని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన రశీదును తప్పకుండా భద్ర పరుచుకోవాలని సూచించారు.

బీటీ రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలి


గజ్జవాణితండాలో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

ఆలేరు రూరల్: బీటీ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. బుధవారం తుర్కపల్లి మండలం గజ్జవాణికుంట తండా, జంగారెడ్డి తండాల్లో చేపట్టిన బీటీరోడ్డు పనులను పరిశీలించి మాట్లాడారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ధూప్‌సింగ్, నాయక్, తండాలవాసులు పాల్గొన్నారు.

పల్లె పండుగలు.. సంస్కృతికి ప్రతీకలు


కొత్తగూడెం బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట: గ్రామదేవతల పండుగలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. బుధవారం మండలంలోని కొత్తగూడెం గ్రామంలో జరిగిన బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, నార్మాక్స్ డైరెక్టర్ మందడి ప్రభాకర్‌రెడ్డి, పున్న రమేష్, జినుకల ప్రభాకర్, గంగుల వెంకటరాజిరెడ్డి చిల్లర కైలాసం, శంబాల వెంకటేశం, ఉప్పు ఈశ్వరయ్య, ఎండీ రెహాన్, వనం చంద్రశేఖర్, ఎండీ జమీరొద్దీన్, గోదాసు పృథ్వీరాజ్, సాల్వేరు లింగం, ఏటెల్లి పరమేష్, నోముల ప్రవీణ్, సుర్వి సతీష్ తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు దోపిడీని అరికట్టాలి


చౌటుప్పల్‌లో ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

చౌటుప్పల్: ఫీజులు, డొనేషన్ల పేరిట చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు పబ్బు వంశీగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజుల నియంత్రణ చేయాలని, అనుమతిలేని పాఠశాలలను మూసివేయాలని కోరుతూ బీజేవైఎం ఆధ్వర్యంలో బుధవారం చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్‌కుమార్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు సామాన్య, మధ్య తరగతి తల్లిదండ్రుల రక్తాన్ని పీలుస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మున్సిపల్ అధ్యక్షుడు చింతకింది కిషోర్, నాయకులు దిండు భాస్కర్, వినయ్‌రెడ్డి, అంతటి నరేష్, సందగళ్ల కిరణ్, శివసాయి, సాయిగణేష్, అంకిత్, భరత్, చింతకింది సంపత్, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ


మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్

ఆలేరు రూరల్: ఉపాధి హామీ పనులపై బుధవారం ఆలేరు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు 14వ విడత సామాజిక తనిఖీ (ఓపెన్ ఫోరం) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్డీఏ పీడీ సురేష్ హాజరయ్యారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో 2023 ఏప్రిల్ 1నుంచి 2024 మార్చి 31 వరకు మండలం చేపట్టిన ఉపాధి పనుపై సమీక్షించారు. హాజరు పట్టికలో ఉన్నట్లుగా ఆన్‌లైన్‌లో కూలీల పేర్లు సరిగా నమోదు చేయకపోవడంతో నష్టపోయారని అధికారులు గర్తించారు. 331 పనులకు గాను కూలీల వేతనం రూ.2,20,11,499 కాగా, మెటీరియల్‌కు రూ.6,39,390, మొత్తం రూ.2,26,50,899 ఉపాధి పనులకు ఖర్చు చేసినట్టు తేల్చారు. ఆయా పనుల్లో జరిగిన తప్పిదాలపై టెక్నికల్ అసిస్టెంట్లకు రూ.11,415, పంచాయతీ కార్యదర్శులకు రూ.5,451, ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.789ల చొప్పున మొత్తం రూ.17,655 జరిమానా విధించామని ఆలేరు ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి చండీరాణి, ఏపీడీ శ్యామల, ఎంపీడీ ఆదిత్యవర్ధన్, అంబుడ్స్‌మన్ వీరమల్లు, ఎంపీఓ సలీం, ఏపీఓ వెంకటకిషన్, సోషల్ ఆడిట్ టీమ్, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందచేస్తున్న కార్మికులు

మర్రిగూడ: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేసి కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ కార్మికలకు రూ.26వేల కనీస వేతనం అందించాలని, పీఆర్సీ అమలు చేయాలని జీఓ నం.51ను సవరించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రమాదం జరిగితే రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పోలెపల్లి రాములు, నక్క నరసింహ, వంపు ముత్తమ్మ, మంజుల, పద్మ, గ్యార దుర్గమ్మ, యాచారం జంగమ్మ, ఇందిరమ్మ, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు


అభయాంజనేయ స్వామి ఆలయం

నకిరేకల్: నకిరేకల్‌లోని శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయ 14వ వార్షికోత్సవాలు గురువారం ప్రారంభకానున్నాయి. వచ్చే నెల ఒకటో తేదీ వరకు వేడుకలు ఘనంగా జరగనున్నాయి. వేడుకలకు ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ ఆలయం పక్కనే ఉన్న శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాలకు ఏర్పాట్లు చేశారు. వంద ఏళ్ల చరిత్ర కలిగిన ఆంజనేయస్వామి ఆలయాన్ని 2007లో ఆలయ కమిటీ సభ్యులు తొలగించి ఆ స్థానంలో దాతల సహాయంతో నూతన ఆలయాన్ని నిర్మించారు. 2010లో నూతన ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసి అభయాంజనేయస్వామి ఆలయంగా నామకరణం చేశారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

చిట్యాల: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కత్తుల లింగస్వామి ఆధ్వర్యంలో కూలీలు బుధవారం చిట్యాల ఏపీఓ శ్రీలతకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నేతలు గుడిసె లక్ష్మీనారాయణ, జోగు లక్ష్మయ్య, కూలీలు పాల్గొన్నారు.

చొల్లేరు వాసులకు ‘లో లెవల్’ కష్టాలు

- ప్రమాదకరంగా మారిన కాజ్‌వే
- వానొచ్చి వాగు పారితే రాకపోకలు బంద్
- బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తుల వేడుకోలు


చొల్లేరులో లో లెవల్ కాజ్‌వే మీదుగా ప్రవహిస్తున్న వరద (ఫైల్)


చొల్లేరు సమీపంలో ఉన్న లో లెవల్ కాజ్‌వే

యాదగిరిగుట్ట రూరల్: వానాకాలం వచ్చిందంటే చాలు మండలంలోని చొల్లేరు గ్రామస్తులకు వాగు కష్టాలు తప్పడం లేదు. వర్షాలు పడినప్పుడు గ్రామ సమీపంలో లోలెవల్ వంతెనపై వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో లో లెవల్ వంతెన ప్రమాదకరంగా మారుతుంది. దీంతో దీనిమీదుగా గ్రామస్తులతోపాటు సమీప గ్రామాల ప్రయాణికులు రాకపోకలు సాగించలేని పరిస్థితి. అత్యవసర పరిస్థితుల్లో వెళ్లాలంటే ప్రాణసంకటంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరదొస్తే రాకపోకలకు అంతరాయం

వర్షాకాలంలో ఈ లో లెవల్ కాజ్‌వే పైనుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు సాగించడానికి అంతరాయం కలుగుతుంది. అత్యవసర సమయంలో వేరే ప్రాంతాలకు వెళ్లాలంటే 10 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించి వేరే ఊరు మీదుగా మండల కేంద్రం చేరుకోవాల్సి వస్తోందని ప్రజలు అంటున్నారు. గ్రామంలోని సుమారు 100 మంది రైతులు తమ వ్యవసాయ బావుల వద్దకు వెళ్లాలంటే ఈ కాజ్‌వే ఉన్న వాగును దాటాల్సి వస్తుంది. అయితే వర్షాకాలంలో ఉదయం, రాత్రి సమయాల్లో వాగు దాటాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా, మండల కేంద్రాలకు వెళ్లాలన్నా, చదువులకు వెళ్లాలన్నా ఈ వాగును దాటలేకపోతున్నామని గ్రామస్తులు, విద్యార్థులు వాపోతున్నారు. వాగు దాటే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నామని ఈ మార్గంలో హై లెవల్ కాజ్‌వే నిర్మాణం చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అధికారులకు విన్నవించాం..



మా గ్రామంలో ప్రధాన రహదారి మార్గంలో ఉన్న లో లెవల్ కాజ్‌వేతో చాలా సంవత్సరాలుగా ఇబ్బందులు ఎదుర్కుంటున్నాం. వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలు సాగించలేకపోతున్నారు. సమస్యను పలుమార్లు అధికారులకు విన్నవించాం. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉంది. వాగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– తోటకూరి బీరయ్య, మాజీ సర్పంచ్, చొల్లేరు

బ్రిడ్జి నిర్మించాలి



చొల్లేరు గ్రామంలో ఉన్న లో లెవల్ కాజ్‌వేతో ప్రజలు, చుట్టుపక్కల గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. వాగు పారే సమయంలో రైతులు, వాహనదారులు, వాగును దాటలేకపోతున్నారు. హై లెవల్ కాజ్‌వే నిర్మించాలని అధికారులకు తెలియజేశాం. కానీ ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. పెద్ద ప్రమాదాలు చోటు చేసుకోకముందే ప్రభుత్వం స్పందించి ఈ వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి.

– తోటకూరి అనురాధ, జెడ్పీటీసీ యాదగిరిగుట్ట